తొమ్మిదేళ్లయినా ప్రారంభం కాని పనులు

- కోర్టు కేసులతో ఆగిన మార్కెట్ నిర్మాణం
- సమస్య పరిష్కారంపై దృష్టి సారించని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

బోరబండ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): బోరబండ డివిజన్ పరిధిలోని శ్రీరామానంద తీర్థ నగర్ (ఎస్సార్టీ నగర్) బస్తీలో కూరగాయల మార్కెట్, కమ్యూనిటీహాల్ నిర్మాణంలో పురోగతి లేకపోవడంతో వ్యాపారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.



శంకుస్థాపన సమయంలో వేసిన శిలాఫలకం


మార్కెట్ నిర్మాణం చేపట్టాల్సిన స్థలం


ప్రస్తుతం ఉన్న మార్కెట్

2016లో నాటి ప్రజాప్రతినిధులు రూ.85 లక్షలతో ఆధునిక భవన నిర్మాణం చేపట్టేందుకు పాత మార్కెట్‌ను కూల్చివేశారు. అయితే కొందరు కోర్టుకు వెళ్లడంతో పనులు నిలిచిపోయాయి. నిర్దిష్ట సమయంలోపు భవనం పూర్తి చేయకపోవడంతో మంజూరైన నిధులు సైతం వెనక్కిపోయాయి. ప్రస్తుతం బస్తీ ప్రజలకు కమ్యూనిటీహాల్, మార్కెట్ అందుబాటులో లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఎస్సార్టీ నగర్ బస్తీ నిర్మాణం జరిగి 40 సంవత్సరాలకు పైగా అవుతోంది. బస్తీలో 295కి పైగా కుటుంబాలు, సుమారు 700 మంది ఓటర్లు ఉన్నారు. శుభకార్యాలు నిర్వహించుకోవడానికి కమ్యూనిటీహాల్ లేకపోవడంతో పక్క బస్తీ కమ్యూనిటీ హాళ్లకు అద్దె భారం చెల్లించాల్సి వస్తోందని వారు వాపోతున్నారు.

భవన నిర్మాణం చేపట్టాలి



మార్కెట్ కూల్చివేత సమయంలో అధికారులు ఇచ్చిన మాట ప్రకారం నూతన భవన నిర్మాణం చేపట్టాలి. రోడ్డుపై కూరగాయలు అమ్ముకోవాలంటే చాలా ఇబ్బందిగా ఉంది. వర్షాకాలంలో మా బాధలు వర్ణనాతీతంగా ఉంటాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి భవనాన్ని నిర్మించాలి.

\- బీపాషా, కూరగాయల వ్యాపారి

ఉన్నతాధికారులు హామీ ఇచ్చారు



నాటి డిప్యూటీ కమిషనర్, పోలీస్ ఉన్నతాధికారులు ఇచ్చిన హామీతోనే అప్పుడు మార్కెట్‌ను ఖాళీ చేశాం. మార్కెట్ నిర్మాణం పూర్తయ్యే వరకు రోడ్డుపైనే కూరగాయలు అమ్ముకోమని చెప్పారు. అయితే ఎనిమిదేళ్లు అయినా పనుల్లో ఎలాంటి పురోగతి లేదు.

\- జయమ్మ, కూరగాయల వ్యాపారి

కోర్టు కేసులతో ఆగిన నిర్మాణం

బస్తీ ప్రజల అవసరాల కోసం మూడు అంతస్తుల భవనం నిర్మించి గ్రౌండ్ ఫ్లోర్‌లో కూరగాయల మార్కెట్, పైన రెండు అంతస్తుల్లో కమిటీహాల్ నిర్మాణం చేపట్టాలని మాజీ మేయర్ మాజిద్ హుస్సేన్, మాజీ డిప్యూటీ మేయర్, ప్రస్తుత కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ 2016లో నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అయితే అప్పటి నుంచి ఓ ప్రైవేట్ వ్యక్తి, జీహెచ్ఎంసీ మధ్య దీనిపై వివాదం కొనసాగుతోంది. కోర్టు స్టేటస్ ఆర్డర్ ఇవ్వడంతో అప్పట్లో పనులు ప్రారంభం కాలేదని స్థానికులు చెబుతున్నారు.


మహేష్‌కుమార్ గౌడ్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఎస్సీ వర్గీకరణ నివేదికకు ఆమోదం శుభపరిణామం

అమీర్‌పేట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై షమీమ్ అక్తర్ కమిటీ ఇచ్చిన నివేదికను శాసనసభలో ఆమోదించడం శుభ పరిణామమని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ కమిటీ అధ్యక్షుడు కొమ్ము రవీందర్ అన్నారు. వర్గీకరణకు మంత్రి వర్గ ఆమోదం తెలిపిన సందర్భంగా అమీర్‌పేట, బల్కంపేటకు చెందిన దళిత సంఘం నాయకులు బుధవారం టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌ను గాంధీ భవన్‌లో కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా కొమ్ము రవీందర్, శ్రీనివాసరావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంతోనే దళిత వర్గాల అభివృద్ధి జరుగుతుందన్నారు. వర్గీకరణ కోసం ఎన్నో సంవత్సరాల నుంచి చేస్తున్న ఉద్యమానికి ఫలితం దక్కిందన్నారు. జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లను పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు గోవిందరాజు, మిరియాల నవీన్ రాజు తదితరులు పాల్గొన్నారు.


ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

అన్ని వర్గాలకు ఆమోదయోగ్యంగా కేంద్ర బడ్జెట్

- బీజేపీ నేత శ్యామ్‌సుందర్ గౌడ్

అమీర్‌పేట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఇటీవల పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాల ప్రజల సమస్యలు తీర్చేవిధంగా ఉందని బీజేపీ మహంకాళి సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు బూర్గుల శ్యామ్‌సుందర్ గౌడ్ అన్నారు. బుధవారం సత్యం టాకీస్ చౌరస్తాలో డివిజన్ అధ్యక్షుడు పవన్ కుమార్ ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి బీజేపీ నాయకులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా శ్యామ్‌సుందర్ గౌడ్ మాట్లాడుతూ.. మధ్యతరగతి ప్రజలు, ఉద్యోగులకు బడ్జెట్‌లో రూ.12 లక్షల వార్షిక ఆదాయంపై పన్ను రద్దు చేయడం ప్రశంసనీయమన్నారు. ఈ బడ్జెట్‌పై అన్ని వర్గాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సరళ, నియోజకవర్గ కన్వీనర్ శ్రీశైలం, ఎంఎస్ విఠల్, భిక్షపతిగౌడ్, అనిల్, చందు తదితరులు పాల్గొన్నారు.


క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

'బసవతారకం'లో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం

బంజారాహిల్స్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ మాసోత్సవాలను పురస్కరించుకొని బంజారాహిల్స్‌లోని బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రి ఆవరణలో బుధవారం ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరం నిర్వహించారు. క్యాన్సర్ రావడానికి గల కారణాలపై వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. హెచ్‌పీవీ వ్యాక్సిన్ తక్కువ ధరలో అందించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సీఈఓ డాక్టర్ కె.కృష్ణయ్య మాట్లాడుతూ.. క్యాన్సర్ వ్యాధిపై పోరాటంలో పేద ప్రజలకు సహాయం చేసేందుకు ఎన్టీఆర్ ఆస్పత్రిని ఏర్పాటు చేశారన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసి క్యాన్సర్ స్క్రీనింగ్ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. మహిళలలో ఎక్కువగా కనిపించే గర్భాశయ క్యాన్సర్ నివారణకు ఉపయోగపడే వ్యాక్సిన్‌ను కేవలం రూ.1500లకు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెడికల్ డైరెక్టర్ టీఎస్ రావు, సర్జికల్ ఆంకాలజిస్ట్ రాజగోపాలన్, ట్రస్టు బోర్డు సభ్యుడు డాక్టర్ రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

డిజైనర్‌ను వేధిస్తున్న యువకుడిపై కేసు నమోదు

బంజారాహిల్స్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): డిజైనర్‌ను వేధిస్తున్న యువకుడిపై కేసు నమోదైంది. జూబ్లీహిల్స్ ప్రశాసన్‌నగర్‌లో ఉండే యువతి ఓ బొటిక్‌లో డిజైనర్‌గా పనిచేస్తుంది. 2022లో నవీన్ అనే యువకుడితో పరిచయం ఏర్పడింది. ఇద్దరూ ప్రేమించుకున్నారు. పెళ్లి చేసుకుందామని ఒత్తిడి చేయడంతో నవీన్ అంగీకరించలేదు. ఈ క్రమంలో ఆమెకు ఇటీవల మరో వ్యక్తితో పెళ్లి కుదిరింది. విషయం తెలుసుకున్న నవీన్ ఆమె ఇంటికి వెళ్లి అసభ్యంగా ప్రవర్తించడంతో పాటు ఫోన్ లాక్కొని పెళ్లి చేసుకోబోయే వ్యక్తికి కొన్ని ఫొటోలు పంపించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం

బంజారాహిల్స్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): పెళ్లి చేసుకుంటానని నమ్మించి సహజీవనం చేసి మహిళను మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదైంది. జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో నివసించే ఓ మహిళకు 20 సంవత్సరాల క్రితం వివాహమైంది. ఓ కుమారుడు కూడా ఉన్నాడు. 15 ఏళ్ల క్రితం భర్తతో విడాకులు తీసుకొని కుమారుడితో కలిసి ఉంటుంది. అదే భవనంలో ఉండే ఎలక్ట్రీషియన్ శ్రీనివాస్‌తో పరిచయమైంది. తనకు భార్య నుంచి విడాకులు వచ్చాయని, పెళ్లి చేసుకుంటానని శ్రీనివాస్ నమ్మించాడు. ఆమెను ఒప్పించి సహజీవనం చేస్తున్నాడు. ఇటీవల పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి చేయడంతో ముఖం చాటేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సహజీవనం చేస్తున్న యువతిపై దాడి.. కేసు నమోదు

బంజారాహిల్స్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఒకరితో మూడేళ్లుగా సహజీవనం చేస్తూ మరొకరితో ప్రేమాయణం నడుపుతున్నాడని తెలిసి నిలదీసిన యువతిపై దాడిచేసిన వ్యక్తిపై కేసు నమోదైంది. మాదాపూర్‌లోని ఓ హాస్టల్ లో నివసించే నిఖిత డిగ్రీ చదువుతోంది. మూడు సంవత్సరాలుగా ప్రసాద్ అనే వ్యక్తితో సహజీవనం చేస్తుంది. మరో యువతితో సంబంధం ఉన్న విషయం తెలియడంతో అతడిని నిలదీసింది. ఈ సమయంలో మద్యం మత్తులో ఉన్న ప్రసాద్ ఆమెపై దాడి చేశారు. తీవ్రంగా గాయపడ్డ ఆమె సోదరి సహాయంతో ఆసుపత్రిలో చేరి పోలీసులు సమాచారం ఇచ్చింది. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

ఖైరతాబాద్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బుధవారం మధ్యాహ్నం ఖైరతాబాద్ నుంచి లక్డీకాపూల్ వెళ్లే మార్గంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు నాంపల్లి రైల్వే పోలీసులకు సమాచారం అందింది. సిబ్బంది వెళ్లి చూడగా రైలు పట్టాలపై ఓ వ్యక్తి మృతిచెంది ఉన్నాడు. మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు. వ్యక్తి 5.7 అడుగుల ఎత్తు ఉంటాడని, వయస్సు 30 నుంచి 35 సంవత్సరాలు ఉంటుందని పోలీసులు తెలిపారు. సంబంధీకులు ఎవరైనా ఉంటే నాంపల్లి రైల్వే పోలీసులను గానీ, 9989872799 నంబర్‌లో గానీ సంప్రదించాలని పోలీసులు తెలిపారు.

ఖైరతాబాద్‌లో పర్యటించిన జోనల్ కమిషనర్

ఖైరతాబాద్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి బుధవారం అధికారులు, కార్పొరేటర్ విజయారెడ్డితో కలిసి ఖైరతాబాద్‌లో పర్యటించారు. ఖైరతాబాద్‌లో ప్రభుత్వ క్రీడా మైదానం (శాఖా గ్రౌండ్) వద్ద చిన్నపాటి వర్షానికే ఇబ్బందికరంగా ఉంటుందని, కమ్యూనిటీహాలులో డ్రెస్సింగ్‌రూంను ఏర్పాటు చేయాలని కార్పొరేటర్ కోరగా.. అందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని జోనల్ కమిషనర్ అధికారులను ఆదేశించారు. ఇందిరానగర్ కాలనీలో డ్రైనేజీ, వర్షపునీటి పైప్‌లైన్లు తరచూ పొంగుతున్నాయని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. మహాభారత్‌నగర్‌లో సీసీ రోడ్డు వేయాలని స్థానికులు కోరగా.. అందుకు ఆయన హామీ ఇచ్చారు. శాఖా గ్రౌండ్‌లో పిల్లలు ఆడుకునేందుకు క్రికెట్ నెట్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్ ఉప కమిషనర్ రజనీకాంత్‌రెడ్డి, వైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్, డీఈ చైతన్య, క్రీడా విభాగం అధికారులు పాల్గొన్నారు.


సమస్యలు తెలుసుకుంటున్న అనురాగ్‌జయంతి


అమ్మవారికి అభిషేకం చేస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి

ముగిసిన పెద్దమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవాలు

బంజారాహిల్స్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్‌లోని పెద్దమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవాలు బుధవారంతో ముగిశాయి. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తిని ఊరేగిస్తూ ఆలయ కోనేరు వద్దకు తీసుకువచ్చి అభిషేకాలు చేశారు. కోనేటిలో వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య చక్రస్నానం చేయించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ చైర్మన్ పి.విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిమ్స్‌లో హిమోగ్లోబిన్ రుగ్మతలకు మెరుగైన చికిత్స

- ఆస్పత్రి డైరెక్టర్ బీరప్ప

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): హిమోగ్లోబిన్ రుగ్మతలకు మెరుగైన చికిత్స అందించడంలో గణనీయమైన పురోగతి సాధించామని నిమ్స్ ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ బీరప్ప తెలిపారు. బుధవారం నిమ్స్‌లో తెలంగాణ జాతీయ ఆరోగ్య మిషన్ సహకారంతో హై పెర్ఫార్మెన్స్ లిక్విడ్ క్రొమాటోగ్రఫీపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బీరప్ప మాట్లాడుతూ.. నిమ్స్‌లో హిమోగ్లోబినోపతి, హెచ్‌పీఎల్‌సీ టెక్నాలజీ స్క్రీనింగ్, డయాగ్నసిస్‌లో ఎంతో అనుభవజ్ఞులైన వైద్య నిపుణులు పనిచేస్తున్నారని తెలిపారు. జన్యు పరమైన రుగ్మతల కోసం రోగ నిర్ధారణ సేవలను బలోపేతం చేయడానికి, చికిత్స తర్వాత ఫలితాలను మెరుగుపర్చడంలో హెచ్‌పీఎల్‌సీ వంటి ఆధునాతన సాంకేతికత కీలకపాత్ర పోషిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఎం తెలంగాణ అదనపు డైరెక్టర్ అమర్‌సింగ్, నిమ్స్ డీన్ డాక్టర్ లిజా రాజశేఖర్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న నిమ్స్ డైరెక్టర్ బీరప్ప



యంత్రాలను పరిశీలిస్తున్న మంత్రి పొంగులేటి

ప్రపంచ వైద్య సేవలకు కేంద్రంగా హైదరాబాద్

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

బంజారాహిల్స్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ ప్రపంచ వైద్య సేవలకు కేంద్రంగా మారుతోందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రెనోవా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆర్థోపెడిక్స్ ఆధ్వర్యంలో బంజారాహిల్స్ రెనోవా సెంచూరీలో ఆర్థోపెడిక్స్ విభాగాన్ని ఆయన బుధవారం ప్రారంభించారు. అనంతరం రోబోటిక్ సర్జరీ యంత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వైద్య రంగం అభివృద్ధికి ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు ప్రజా సేవ చేయాలని సూచించారు.

కేసీఆర్ ఎస్సీ వర్గీకరణ ఎందుకు చేయలేదు?

- గజ్జెల కాంతం

పంజాగుట్ట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ప్రకటించి తీర్మానం చేయడాన్ని స్వాగతిస్తున్నామని తెలంగాణ ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ గజ్జెల కాంతం అన్నారు. గత ప్రభుత్వం చేసిన సమగ్ర కుటుంబ సర్వే నివేదికను ఎందుకు బయటపెట్టలేదని, కేసీఆర్ వర్గీకరణ ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో తెలంగాణ బీసీ సంఘాల జేఏసీ చైర్మన్ ఓరుగంటి వెంకటేశం గౌడ్, నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికలలో అన్ని రాజకీయ పార్టీలు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసి, దాని ప్రకారం సీట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 30 సంవత్సరాల వర్గీకరణ పోరాటంలో ఎన్నో కష్టాలు పడ్డామని, లాఠీ దెబ్బలు తిన్నామని చెప్పారు. చంద్రబాబు నాయుడు వర్గీకరణ చేసి మాదిగలకు న్యాయం చేయగా, అది సహించలేని వారు న్యాయస్థానంకు వెళ్లి రద్దు చేయించారని ఆయన వెల్లడించారు. ఉద్యమకారులను అరెస్టు చేసిన చరిత్ర బీఆర్ఎస్ పార్టీదేనన్నారు. సీఎం రేవంత్ రెడ్డి అన్ని వర్గాల అభివృద్ధి, సంక్షేమానికి కట్టుబడి నిర్ణయాలు తీసుకుంటున్నారని చెప్పారు.



సమావేశంలో మాట్లాడుతున్న గజ్జెల కాంతం

ట్యాంకర్ల బుకింగ్‌లో అక్రమాలకు పాల్పడితే చర్యలు

- వాటర్‌బోర్డు ఎండీ అశోక్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): గతేడాది అక్రమ పద్ధతిలో ట్యాంకర్లు బుక్ చేసిన మొబైల్ నెంబర్లు, క్యాన్ నంబర్లను బ్లాక్ చేయనున్నట్లు వాటర్‌బోర్డు ఎండీ అశోక్‌రెడ్డి వెల్లడించారు. వచ్చే వేసవిలో ఏ ట్యాంకర్ ఓనర్ అయినా, డ్రైవర్ అయినా.. ఇలాంటి పనులకు పాల్పడితే బ్లాక్ లిస్టులో పెట్టడమే కాకుండా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఖైరతాబాద్‌లోని వాటర్‌బోర్డు ప్రధాన కార్యలయంలో ఐటీ విభాగం అధికారులతో ఎండీ అశోక్‌రెడ్డి ట్యాంకర్ మేనేజ్‌మెంట్‌పై చర్చించారు. ఈ సందర్భంగా ఎండీ మాట్లాడుతూ.. గతేడాది అత్యధిక ట్యాంకర్లు బుక్ అయ్యాయని.. ఇదే సమయంలో నలభై మందికి పైగా డ్రైవర్లు అక్రమాలకు పాల్పడ్డట్లు గుర్తించామని తెలిపారు. తప్పుడు పద్ధతిలో ట్యాంకర్లు బుక్ చేసి రెట్టింపు రేట్లకు అమ్ముకోవడానికి తెరలేపారని చెప్పారు. అత్యధికంగా ఒక్కో క్యాన్‌పై వంద ట్రిప్పులకు పైగా బుక్ చేసినట్లు ప్రాథమికంగా గుర్తించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ అంశంపై లోతుగా అధ్యయనం చేసి వివరాలు సేకరించాలని ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఈడీ మయాంక్ మిట్టల్, ఐటీ వింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మాదిగలకు 11 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలి

- జనసేన నేత సైదాల శ్రీనివాస్

పంజాగుట్ట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై అసెంబ్లీలో తీర్మానం చేసి ఆమోదించడాన్ని స్వాగతిస్తున్నామని, మూడు గ్రూపులుగా కాకుండా ఏబీసీడీ గ్రూపులుగా విభజించాలని జనసేన పార్టీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు సైదాల శ్రీనివాస్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ.. జనాభా దామాషా ప్రకారం వర్గీకరణ చేయాలన్నారు. మాదిగ సామాజిక వర్గానికి 11 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. తమ పార్టీ అధినేత, ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ కులాలు లేని రాజకీయం చేయాలని చెప్పారని ఆయన గుర్తు చేశారు.

టిఫిన్ డబ్బులివ్వకుండా బెదిరించిన వారిపై కేసు

అమీర్‌పేట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): టిఫిన్ చేసి డబ్బులు ఇచ్చేందుకు నిరాకరించడంతో పాటు డబ్బులు అడిగితే చంపుతానని బెదిరింపులకు పాల్పడ్డ యువకులపై ఎస్ఆర్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఆనంద్ అనే వ్యక్తి బాపునగర్‌లో టిఫిన్ సెంటర్ నడుపుతున్నాడు. మంగళవారం అర్ధరాత్రి ముగ్గురు వ్యక్తులు వచ్చి టిఫిన్ చేశారు. అయితే పూర్తి డబ్బులు ఇవ్వకుండా బెదిరింపులకు దిగారు. దీంతో బాధితుడు ఎస్ఆర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాపునగర్‌కు చెందిన రమేష్, గచ్చిబౌలికి చెందిన పవన్, దీనేష్‌లపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.


అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న కోట నీలిమ

అర్హులందరికీ రేషన్ కార్డులు

- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కోట నీలిమ

అమీర్‌పేట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డులు రానివారు నిరాశ చెందాల్సిన అవసరం లేదని, అర్హులైన వారందరికీ కార్డులు అందజేస్తామని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, సనత్‌నగర్ నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జ్ కోట నీలిమ అన్నారు. బుధవారం అమీర్‌పేటలో రేషన్ కార్డుల విషయమై సివిల్ సప్లై అధికారులతో కలిసి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నీలిమ మాట్లాడుతూ.. అధికారులు విడుదల చేస్తున్న జాబితాల్లో పేర్లు లేవని పేదలు ఆందోళన చెందవద్దని, అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించి ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు మంజూరు చేస్తామన్నారు.

టీఎన్జీవో హైదరాబాద్ కార్యదర్శిగా కూరాడి శ్రీనివాస్


శ్రీనివాస్

ఖైరతాబాద్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): టీఎన్జీవో హైదరాబాద్ జిల్లా కార్యదర్శిగా కె.శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ మేరకు టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు ఎస్ విక్రమ్ నియామక పత్రం అందజేశారు. శ్రీనివాస్ రెడ్‌హిల్స్‌లోని హైదరాబాద్ జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నారు. ఆయన మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో యూనియన్ కార్యదర్శిగా నియమించిన రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీష్‌కు, ప్రధాన కార్యదర్శి ముజీబ్ హుస్సేన్‌కు హైదరాబాద్ అధ్యక్షుడు విక్రమ్‌కు, అసోసియేట్ అధ్యక్షుడు రాజ్‌కుమార్‌కు, ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు. యూనియన్ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు యువకుల ఆత్మహత్య

- ఒకరు సాఫ్ట్‌వేర్ .. మరొకరు సీఏ విద్యార్థి

అమీర్‌పేట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు యువకులు ఆత్మహత్య చేసుకున్నారు. ఒకరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కాగా మరొకరు సీఏ చదువుతున్నాడు. ఎస్ఆర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా బూగారం మండలం బోపాల్‌పూర్ గ్రామానికి చెందిన గంతల కుమార్(28) గచ్చిబౌలిలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ బీకేగూడ సంజయ్‌గాంధీనగర్ కాలనీలో తన స్నేహితుడు గంగాధర్‌తో కలిసి ఉంటున్నాడు. బుధవారం ఉదయం గంగాధర్ బయటకు వెళ్లి తిరిగివచ్చేసరికి కుమార్ ఉరేసుకుని కనిపించాడు. గంగాధర్ ఫిర్యాదు మేరకు అక్కడకు చేరుకున్న పోలీసులు సుసైడ్ నోట్ స్వాధీనం చేసుకున్నారు. 'ఈ జీవితం నాకు నచ్చలేదు నన్ను క్షమించండి' అని అందులో ఉంది. పోలీసులు కేసు నమోదు చేశారు.

బాపూనగర్ హాస్టల్‌లో సీఏ విద్యార్థి..

మంగళవారం రాత్రి సీఏ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కర్నాటక రాయ్‌చూర్ జిల్లాకు చెందిన రాజుశెగ్గి కుమారుడు అమర్‌జిత్ (18) ఎస్ఆర్‌నగర్ బాపూనగర్‌లోని ఓ హాస్టల్‌లో ఉంటూ సీఏ చదువుతున్నాడు. డిసెంబర్ 22న పరీక్షలు రాసి సొంత గ్రామానికి వెళ్లాడు. పరీక్షలు సరిగా రాయలేదని బాధపడ్డాడని కుటుంబ సభ్యులు తెలిపారు. జనవరి 27న మరో పరీక్ష రాయాల్సి ఉండగా తిరిగి నగరానికి వచ్చి హాస్టల్ ఉన్నాడు. మంగళవారం ఉదయం కళాశాలకు వెళ్లాల్సి ఉండగా తన ఆరోగ్యం బాగాలేదని గదిలోనే ఉన్నాడు. రాత్రి 10.30 గంటల సమయంలో రూమ్‌మేట్ ఎంత పిలిచినా తలుపు తీయకపోవడంతో హాస్టల్ నిర్వాహకులకు చెప్పాడు. వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు తలుపులు తెరిచి చూడగా అమర్‌జిత్ ఉరి వేసుకుని కనిపించాడు. ఆత్మహత్యకు గల కారణాలపై పోలీసులు విచారణ జరిపి మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు.

రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలి



సీఈఓ కు వినతిపత్రం అందజేస్తున్న శ్యామ్‌కుమార్

తిరుమలగిరి ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): తిరుమలగిరి లాల్‌బజార్ సమీపంలోని ఆశ ఆఫీసర్స్ కాలనీ నుంచి అమ్ముగూడ రైల్వేస్టేషన్ వరకు రోడ్డు గుంతలమయంగా మారింది. దీంతో ప్రయాణికులు ప్రమాదాల బారిన పడతున్నారు. ఈ రోడ్డు నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం గతంలో రూ. కోటి 15 లక్షలు మంజూరు చేసింది. రోడ్డు నిర్మించకపోవడంతో జనం రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో వెంటనే రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని కోరుతూ మంగళవారం కంటోన్మెంటు బోర్డు 7వ వార్డు మాజీ సభ్యుడు ప్యారసాని శ్యామ్‌కుమార్ సీఈఓ మధుకర్ నాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. తన వినతికి సీఈఓ సానుకూలంగా స్పందించారని శ్యామ్‌కుమార్ తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు చిన్నన్న, పెర్మాల్, అర్చన, మణి పాల్గొన్నారు.

నూతన ఆలయ కమిటీ సభ్యులకు సన్మానం



ఆలయ కమిటీ సభ్యులను సన్మానించిన ఆదం సంతోష్ కుమార్

అడ్డగుట్ట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): నూట యాభై ఏళ్ల చరిత్ర కలిగి ఉన్న తుకారాంగేట్ పహాడీ హనుమాన్ ఆలయ చైర్మన్ మేకల లక్ష్మణ్‌ప్రసాద్, సభ్యులు విష్ణుప్రసాద్, విఠల్‌రావు, మూర్తి, సంతోష్, లలిత్ కుమార్‌లను బుధవారం కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ ఇన్‌చార్జి ఆదం సంతోష్‌కుమార్ కమిటీ సభ్యులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆదం మాట్లాడుతూ, ఆలయాభివృద్ధి కోసం కమిటీలోని ప్రతి సభ్యుడు శ్రమించాలని, ఆలయ సుందరీకరణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా ఆలయంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు క్రమం తప్పకుండా నిర్వహించాలని సూచించారు.



డ్యాన్స్‌లతో అదరగొట్టిన చిన్నారులు

హరిహరకళాభవన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): సంప్రదాయ, వెస్ట్రన్, జానపద నృత్యాలతో విద్యార్థులు అలరించారు. చిన్నారుల డ్యాన్సులను చూసి వారి తల్లిదండ్రులు మురిసిపోయారు. మచ్చబొల్లారం మారుతీ వీధిలోని సంజన స్కూల్ వార్షికోత్సవం సికింద్రాబాద్ హరిహరకళా భవన్‌లో కన్నుల పండువలా నిర్వహించారు. ప్రొఫెసర్ వెంకట్రావ్ ముఖ్య అతిథిగా హాజరయ్యా రు. విద్యార్థులకు ప్రిన్సిపాల్ శారద, విజయకుమార్ బహుమతులను అందజేశారు.



మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసిన బీజేపీ నేతలు

సామాన్యుడికి ఉపయోగపడేలా కేంద్ర బడ్జెట్: సౌందర్య

అడ్డగుట్ట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : సామాన్య ప్రజలకు ఉపయోగపడేలా కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టారని అడ్డగుట్ట డివిజన్ బీజేపీ అధ్యక్షురాలు గాజుల సౌందర్య అన్నారు. బుధవారం తుకారాంగేట్ వెంకట్‌నగర్‌లో మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకంచేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ సామాన్య, మధ్యతరగతి ప్రజలకు ఉపయోగపడేలా ఉందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు హంసరాజు, వీరేశం, శివలింగం, రాజారాం, దు ర్గాప్రసాద్, శివాజీ, రాజశేఖర్, శ్రావణ్, వెంకటస్వామి, లక్ష్మణ్, రాజశేఖర్, నగేస్, రాంచందర్, మహిళా నాయకురాళ్లు శ్యామల, రాములమ్మ, కల్యాణి పాల్గొన్నారు.

● శుభాకాంక్షలు..



బీజేపీ మహంకాళి సికింద్రాబాద్ జిల్లాకు నూతన అధ్యక్షుడిగా నియమించబడ్డ గుండగోని భరత్ గౌడ్‌ను కలిసి శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలుపుతున్న పార్టీ సికింద్రాబాద్ పార్లమెంట్ సోషల్ మీడియా కో కన్వీనర్ అనీష్ వర్మ.

- (రాంగోపాల్‌పేట్ - ఆంధ్రజ్యోతి)



ముఖ్యమంత్రిని కలిసి ఆహ్వానిస్తున్న జంపన ప్రతాప్

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసిన జంపన

సికింద్రాబాద్, ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో బుధవారం కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఇంపీరియల్ గార్డెన్‌లో ఈనెల 7వ తేదీన జరిగే తన సోదరుడు జంపన రవి కుమారుడి వివాహానికి రావాల్సిందిగా ముఖ్యమంత్రిని కోరారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ ఉన్నారు.



బాపూజీనగర్ బస్తీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్ , శరత్, జంపన ప్రతాప్

బస్తీల సమస్యలను పరిష్కరిస్తా : ఎమ్మెల్యే శ్రీగణేష్

బోయిన్‌పల్లి, ఫిబ్రవరి 05 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ నియోజకవర్గం పరిధిలోని బోయిన్‌పల్లి ఒకటవ వార్డులోని బస్తీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. బస్తీబాటలో భాగంగా బుధవారం ఆయన బోయిన్‌పల్లి మార్కెట్ యార్డు పాలకమండలి సభ్యుడు సాయిశరత్, బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్, కాంగ్రెస్ నాయకుడు బద్దం బల్వంత్‌రెడ్డిలతో కలిసి లక్ష్మీనర్సింహయ్య కాలనీ, బాపూజీనగర్‌లలో పర్యటించారు. కాలనీల్లో నెలకొన్న సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఈ నేపథ్యంలో రెండు బస్తీల్లో నీటి ఎద్దడి నివారణకు పవర్‌బోర్‌వెల్స్ మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. అదే విధంగా విద్యుత్ స్తంభాల తరలింపు పనులు కూడా చేపడతామని చెప్పడమే కాకుండా అధికారులతో మాట్లాడి వెంటనే పనులు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో వరప్రసాద్, అజయ్, ముఖేష్ యాదవ్, కరణ్ సింగ్ స్థానికులు పాల్గొన్నారు.

ప్రతిపాదనలతోనే సరి..
రోడ్డు విస్తరణ ఎప్పుడో మరి?

ఇరుకుగా మారిన చిలకలగూడ-జామై ఉస్మానియా ప్రధాన రహదారి

- 20 ఏళ్లుగా కార్యరూపం దాల్చని రోడ్డు విస్తరణ
- నిత్యం ట్రాఫిక్ జామ్.
- తీవ్ర అవస్థలు పడుతున్న వాహనదారులు
- రోడ్డును వెంటనే విస్తరించాలని ప్రభుత్వానికి స్థానికులు విజ్ఞప్తి



వారాసిగూడ చౌరస్తా మూలమలుపులో ఆర్టీసీ బస్సుల అవస్థలు

బౌద్ధనగర్, ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): చిలకలగూడ-జామై ఉస్మానియా ప్రధాన రహదారి విస్తరణకు నోచుకోకపోవడంతో నిత్యం ట్రాఫిక్ జామ్‌లతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. నగరంలో ఎటు చూసినా రోడ్డు విస్తరణ పనులు జరుగుతుండగా, గత 20 ఏళ్లుగా ఈ రోడ్డు విస్తరణ ప్రతిపాదనలు మాత్రం కార్యరూపం దాల్చడం లేదు. పెరిగిన జనాభా, రోజు రోజుకూ పెరుగుతున్న వాహనాల సంఖ్య నేపథ్యంలో రద్దీ అధికమై ఇరుకుగా ఉండే ఈ రోడ్డుపై ప్రయాణం నరకయాతనగా మారుతోంది.

ఆర్టీసీ బస్సుల సంఖ్యను తగ్గించారు

జామై ఉస్మానియా, బౌద్ధనగర్, ఆర్ట్స్ కాలేజీ, వారాసిగూడ, శ్రీదేవీ నర్సింగ్‌హోమ్, నామాలగుండు, సీతాఫల్‌మండి, మైలార్‌గడ్డ, చిలకలగూడ తదితర ప్రాంతాల నుంచి ప్రతిరోజూ వేలాది మంది వివిధ పనుల నిమిత్తం నగరంలోని వివిధ ప్రాంతాలకు వెళ్తుంటారు. అయితే, చిలకలగూడ-జామై ఉస్మానియా ప్రధాన రహదారి ఇరుకుగా ఉండటంతో ఆర్టీసీ బస్సుల సంఖ్యను కూడా తగ్గించారు. అలాగే చిలకలగూడ, సీతాఫల్‌మండి, వారాసిగూడ, టర్నింగ్‌పాయింట్ వద్ద మూలమలుపులు, రహదారి ఇరుకుగా ఉండటంతో వాహనాలు ఎదురెదురుగా వెళ్లాలంటే డ్రైవర్లు చాలా ఇబ్బంది పడుతున్నారు. దీనికి తోడు కొంతమంది వర్తకులు ఇరుకుగా ఉన్న ఈ రోడ్డును కూడా ఆక్రమించి వ్యాపారులు చేయడంతో రాకపోకలకు మరింత ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డు విస్తరణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

రోడ్డు ఇరుకును బట్టి విస్తరణ..

చిలకలగూడ నుంచి జామై ఉస్మానియా వరకు 60 అడుగుల మేర విస్తరించాలని అధికారులు గతంలో మార్కింగ్ చేశారు. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో మాస్టర్ ప్లాన్‌లో చిలకలగూడ, సీతాఫల్‌మండి, వారాసిగూడ, టర్నింగ్ పాయింట్ చౌరస్తాలను 80 అడుగులు, మాములు చోట 60 అడుగుల మేరకు విస్తరించాలని ప్రతిపాదించారు. ఆ తర్వాత తెలంగాణ ప్రభుత్వ హయాంతో ఫ్లాట్‌గా 80 అడుగులు విస్తరించాలని ప్రతిపాదనలు చేశారు. ప్రసుత్తం రోడ్డు ఇరుకును బట్టి విస్తరించాలని, భవిష్యత్‌లో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా రోడ్డు విస్తరించేలా ప్రణాళికలు రూపొందించారు. చిలకలగూడ నుంచి జామై ఉస్మానియా వరకు రోడ్డు విస్తరణలో 347 ఇళ్లు, వ్యాపార భవనాలు కనుమరుగు కానున్నాయి. కాగా, రోడ్డును విస్తరించొద్దని కొంతమంది వ్యాపారులు అడ్డుపడుతున్నట్లు సమాచారం.

రోడ్డును విస్తరించాలి



చిలకలగూడ- జామై ఉస్మానియా రోడ్డు విస్తరణ చేపట్టాలి. రోడ్డు ఇరుకుగా ఉండటంతో ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. జీహెచ్‌ఎంసీ అధికారులు, ప్రజాప్రతినిధులను కలిసి ఈ రోడ్డు దుస్థితిపై ఫిర్యాదు చేశాం. మూలమలుపులో ఇరుకుగా ఉండటంతో వారాసిగూడ చౌరస్తాలో రెండువాహనాలు ఎదురెదురుగా వెళ్లాలంటే చాలా ఇబ్బందులు పడుతున్నారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి వారాసిగూడ రోడ్డు విస్తరణ పనులను మొదలు పెట్టాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

- వల్లారపు శ్రీనివాసకుమార్, టీడీపీ సికింద్రాబాద్ ఇన్‌చార్జి

మూలమలుపుల్లో తరచూ ప్రమాదాలు



చిలకలగూడ, సీతాఫల్‌మండి, వారాసిగూడ టర్నింగ్ పాయింట్ వద్ద, మూలమలుపుల వద్ద రోడ్డు విస్తరణ చేస్తే వాహనాదారులకు కొద్దిగా ఉపశమనం కలుతుగుంది. మూలమలుపుల్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇరుకుగా ఉన్నా రోడ్డు పక్కనే వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. వారాసిగూడ చౌరస్తాలో ఆర్టీసీ బస్సులు ఎదురెదురుగా వస్తే డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రహదారి విస్తరణ ప్రతిపాదనలను ముందుకు తీసుకెళ్లాలని అధికారులను, ప్రజాప్రతినిధులను కోరుతున్నారు.

- లావణ్య, బౌద్ధనగర్

20 ఏళ్లలో మూడుసార్లు మార్కింగ్

చిలకలగూడ- జామై ఉస్మానియా రోడ్డు విస్తరణ కోసం జీహెచ్‌ఎంసీ కౌన్సిల్‌లో నిధులు మంజూరైనా ఇప్పటి వరకు విస్తరణ మాత్రం పనులు మాత్రం మొదలు కాలేదు. అధికారులు అప్పుడప్పుడు వచ్చి రోడ్డు విస్తరణ పేరిట హడావుడి చేసి వెళ్తున్నారు తప్ప పనులు మాత్రం జరగడం లేదని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

జీహెచ్‌ఎంసీ అధికారులు రోడ్డు విస్తరణ పేరిట గత 20 ఏళ్లలో మూడుసార్లు మార్కింగ్ వేసి చేతులు దులుపుకున్నారని స్థానికులు చెప్తున్నారు. రోడ్డు విస్తరణపై వ్యాపారులు, భవన యాజమానులతో సమావేశం కూడా నిర్వహించ లేదని అంటున్నారు. ఇతర ప్రాంతాల్లో రోడ్డు విస్తరణ జరిగి అభివృద్ధిలో దూసుకుపోతుంటే తమ ప్రాంతం మాత్రం రోడ్డు ఇరుకుగా ఉండటంతో అభివృద్ధికి నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రజల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం అండ

● ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్



లబ్ధిదారులకు ఎల్‌ఓసీ పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే తలసాని

రాంగోపాల్‌పేట్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యానికి గురైనప్పుడు ధైర్యంగా ఉండాలని, మెరుగైన వైద్యంతో తిరిగి సాధారణ జీవితం గడపొచ్చని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థిక సాయం చేస్తూ ప్రజల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని ఆయన పేర్కొన్నారు. వెన్నుముక సంబంధ సమస్యతో బాధపడుతున్న సనత్‌నగర్‌కు చెందిన చెంచు లక్ష్మికి చికిత్స నిమిత్తం రూ. 2 లక్షలు, అమీర్‌పేటలోని సుప్రభాత్ నగర్‌కు చెందిన గోపికి గుండె చికిత్స కోసం రూ. 1.10 లక్షలు, ఎస్సార్ నగర్‌కు చెందిన రాథోడ్ ఉదయ్‌సింగ్‌కు రూ. 1.10 లక్షల ఆర్థిక సాయం ఎమ్మెల్యే చొరవతో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైంది. ఇందుకు సంబంధించిన ఎల్‌ఓసీ పత్రాలను బుధవారం వెస్ట్ మారేడుపల్లిలోని తన కార్యాలయంలో లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు తలసాని అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కొలన్ లక్ష్మీ, బీఆర్ఎస్ నాయకులు బాల్‌రెడ్డి, నామన సంతోష్ మణికుమార్, కూతురు నర్సింహ గోపిలాల్‌చౌహాన్, బలరాం, హరిసాంగ్ తదితరులు పాల్గొన్నారు.

రైతు బజార్‌ను తరలించొద్దు

● ఎమ్మెల్యేను కలిసిన రైతు బజార్ రైతులు



ఎమ్మెల్యేకు వినతి పత్రం సమర్పిస్తున్న రైతు బజార్ రైతులు

అడ్డగుట్ట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : అల్వాల్‌లోని రైతు బజార్‌ను దూర ప్రాంతాలకు తరలించొద్దని కోరుతూ రైతులు బుధవారం కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్‌ను తుకారాంగేట్‌లోని ఆయన నివాసంలో కలిసి వినతి పత్రం సమర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం జూబ్లీ బస్టాండ్ నుంచి తూంకుంట వరకు నిర్మిస్తున్న ఎలివేటెడ్ కారిడార్‌లో భాగంగా అల్వాల్ రైతు బజార్ భూమిని ప్రభుత్వం సేకరిస్తున్న నేపథ్యంలో తమకు మరోచోట కాంప్లెక్స్‌లను నిర్మించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ మేరకు హైదరాబాద్ జిల్లా సరిహద్దులోని మేడ్చల్-మల్కాజిగిరి, సిద్దిపేట, మెదక్, నల్గొండ జిల్లాలకు చెందిన గ్రామాల కూరగాయాల రైతులు ఎమ్మెల్యేను కలిసి వినతి పత్రం సమర్పించారు. గత 30 ఏళ్లుగా తాము తమ పొలాల్లో కూరగాయాలను పండించి అల్వాల్ రైతు బజార్‌కు తీసుకొచ్చి అమ్ముకుంటున్నామని తెలిపారు. బస్‌స్టేషన్, రైల్వే స్టేషన్లకు అల్వాల్ రైతు బజార్ దగ్గరగా ఉండటం వల్ల తమకు ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు. ఈ నేపథ్యంలో రైతు బజార్లను దూరంగా మరోచోటకు మార్చవద్దంటూ ఎమ్మెల్యేను కలిశారు. ఎమ్మెల్యే స్పందిస్తూ రైతు బజార్ సమస్యను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తానని రైతులకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

ముగిసిన రథసప్తమి వేడుకలు

తిరుమలగిరి ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): తిరుమలగిరి విలేజ్ వనిత ఎన్‌క్లేవ్‌లోని సూర్యదేవా లయంలో రథసప్తమి వేడుకలు ఘనంగా ముగిశాయి. నగరంతో పాటు తెలంగాణ ప్రాంతానికి చెందిన భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామి వారిని దర్శించుకున్నారు. గోధుమలు, పూలశనగలు, బెల్లం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భారీ సంఖ్యలో భక్తులు రావడంతో మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు దర్శనం కోసం వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. కొంతమంది భక్తులు బుధవారం ఉదయం కూడా విచ్చేసి దర్శనం చేసుకున్నారు. తెలంగాణలో ప్రసిద్ధి చెందిన పుణ్య క్షేత్రం కావడం.. అందులోను మాఘమాసం సూర్యభగవానుడికి శ్రేష్ఠమైనది కావడంతో భక్తులు భారీ సంఖ్యలో విచ్చేసి స్వామి వారిని దర్శించుకున్నారు. కాగా, భక్తులకు తాగునీటి సమస్య రాకుండా వార్డు7 అలంక్రిత మెడోస్ కాలనీ అధ్యక్షుడు నరసింహ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత తాగునీటి క్యాంపును ఎమ్మెల్యే శ్రీగణేశ్ ప్రారంభించారు.

ఉజ్జయిని మహంకాళి ఆలయంలో 8 నుంచి కుంకుమార్చన పూజలు

సికింద్రాబాద్, ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఆలయంలో ఈనెల 8 నుంచి 12వ తేదీ వరకు కుంకుమార్చన పూజలు ఘనంగా నిర్వహిస్తామని ఆలయ కార్యనిర్వహణాధికారి గుత్తా మనోహర్‌రెడ్డి తెలిపారు. లోక కల్యాణం కోసం ఐదురోజుల పాటు ఉదయం పది నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు లయ ప్రాంగణంలోని అద్దాల మండపంలో ఈ పూజలు జరుగుతాయన్నారు. ప్రతి రోజూ సామూహిక శ్రీలలితా సహస్రనామ పారాయణం, కుంకుమార్చనలు మహిళా సత్సంగ్ బృందం ఆధ్వర్యంలో జరుగుతాయన్నారు. రోజూ ఓ మహిళకు సుహాసిని పూజ నిర్వహిస్తామన్నారు. 12వ తేదీ శాంతి హోమం, పూర్ణాహుతి, విశేషపూజలు ఉంటాయని, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని గుత్తా మనోహర్‌రెడ్డి సూచించారు.

కంటోన్మెంట్ అభివృద్ధే బీజేపీ లక్ష్యం

● నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ



అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన రామకృష్ణ

సికింద్రాబాద్, ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ కంటోన్మెంట్ అభివృద్ధే బీజేపీ లక్ష్యమని కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యుడు జె.రామకృష్ణ అన్నారు. బుధవారం కంటోన్మెంట్ పరిధిలోని 3వ వార్డు మడ్‌ఫోర్ట్‌లో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే ప్రాథమిక పాఠశాల వద్ద అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధికారంలోకి వచ్చాక కంటోన్మెంట్ ప్రాంతంలో అనేక మార్పులకు శ్రీకారం చుట్టి, నూతన సంస్కరణలు చేపట్టామన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న నిధులతో పాటు బోర్డు నిధులతో కంటోన్మెంట్‌లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి తప్ప రాష్ట్ర ప్రభుత్వం నయా పైసా ఇవ్వటం లేదన్నారు. కార్యక్రమంలో బీఎస్ శ్రీనివాస్, అరుణ్, భాగ్యలక్ష్మి, వినోద, మధు, ప్రవీణ్, రేఖా, నిరాజ్, షణ్ముక్, కుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

యాదగిరిగుట్ట దేవస్థానానికి వీల్‌చైర్లు అందజేత



వీల్‌చైర్లు అందిస్తున్న నాగులూరి సాయిబాబా తదితరులు

బౌద్ధనగర్, ఫిబ్రవరి5 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ చిలకలగూడకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త, గ్రేటర్ హైదరాబాద్ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు నాగులూరి సాయిబాబాతో పాటు పద్మజారేఖ, నరేష్‌కుమార్ దంపతులు యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి వీల్‌చైర్లు వితరణగా అందించారు. ఆలయం ప్రాంగణంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆధునాతన వీల్‌చైర్లను ఆలయ కార్యనిర్వహణాధికారి భాస్కరరావుకు అందజేశారు. పవిత్రపుణ్యక్షేత్రమైన యాదిగిరిగుట్టకు వచ్చే దివ్యాంగులు, వృద్ధులు, నడవలేని వారికి మరింత సులభంగా స్వామివారి దర్శనభాగ్యం కల్పించేందుకు వీల్‌చైర్లు అందజేశామని సాయిబాబా తెలిపారు. దాతలు సాయిబాబా, పద్మజారేఖ, నరేష్‌కుమార్ దంపతులను ఆలయ ఈఓ శాలువా కప్పి సత్కరించారు. అసిస్టెంట్ ఈఓ రమేష్, ఆలయ ప్రతినిధులు, అర్చకులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఈఎస్ఐ ఉద్యోగుల నిరసన

పద్మారావునగర్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రి ఎదురుగా ఉన్న బీమా వైద్య సేవల(ఈఎస్ఐ)ఉద్యోగులు చేపట్టిన నిరసన ప్రదర్శన కొనసాగుతోంది.బుధవారం భోజన విరామ సమయంలో డైరెక్టరేట్ కార్యలయం ఎదురుగా ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి, ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డీఐఎంఎస్ యూనిట్ వ్యవస్థాపక అధ్యక్షుడు వీరన్న గౌడ్ మాట్లాడుతూ... బీమా వైద్య సేవలు శాఖను మూసివేసి ఈఎస్ఐ సొసైటీ ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనలను తాము వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. ఉద్యోగులకు భవితకు నష్టం కలిగించే ఎలాంటి నిర్ణయం తీసుకున్నా వ్యతిరేకిస్తామని స్పష్టం చేశారు. నిరసనలో వివిధ విభాగాల ఉద్యోగులు పాల్గొన్నారు.

గృహోపకరణాల రిపేరింగ్‌లో ఉచిత శిక్షణ

పద్మారావునగర్,5,(ఆంధ్రజ్యోతి): జనహిత సేవా ట్రస్ట్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగులకు ఉచిత నైపుణ్య శిక్షణ ఇస్తున్నామని సంస్థ మేనేజింగ్ ట్రస్టీ ఎస్.నరసింహమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. భోలక్‌పూర్ ఇంటి నంబర్ 6-4-450ఏ లోని తమ శిక్షణా కేంద్రంలో ఏసీ, ఎయిర్‌కూలర్, ఫ్రిడ్జ్, వాషింగ్ మెషీన్, గీజర్ వంటి గృహోపకరణాల రిపేరింగ్‌లో పది రోజులు ఉచితంగా శిక్షణ ఇస్తామన్నారు. 18 ఏళ్ల వయసు కలిగిన యువతీ యువకులు శిక్షణకు హాజరు కావాలని, శిక్షణ పూర్తయిన అనంతరం సర్టిఫికెట్ అందజేస్తామన్నారు. మరిన్ని వివరాలకు మొబైల్ నం. 8106887523 ద్వారా ఎం.శ్రీనివాస్‌ను సంప్రదించాలని ఆయన అన్నారు.

అన్నానగర్‌లో పర్యటించిన కార్పొరేటర్



స్థానికుల నుంచి సమస్యలు అడిగి తెలుసుకుంటున్న కార్పొరేటర్ హేమ

బౌద్ధనగర్, ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి డివిజన్ అన్నానగర్‌లో స్థానిక కార్పొరేటర్ సామల హేమ అధికారులతో కలిసి బుధవారం పర్యటించారు. స్థానికుల ఫిర్యాదు మేరకు అన్నానగర్‌లో శిథిలావ్యస్థలో ఉన్న చిన్న నాలాను పరిశీలించారు. ఇళ్ల మధ్యలో ఉండే నాలాకు త్వరగా మరమ్మత్తులు చేపట్టాలని అధికారులను కోరారు. అనంతరం కాలనీలోని సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. స్థానికులు తన దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. జీహెచ్‌ఎంసీ ఏఈ కౌశిక్, నాయకురాలు లక్ష్మి, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

రైలు దిగుతూ ప్రమాదం..

● చికిత్స పొందుతూ ప్రయాణికుడి మృతి



మణయ్య మృతదేహం

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రైలు దిగే క్రమంలో జారి కిందపడి తీవ్ర గాయాలకు గురైన ఓ ప్రయాణికుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ పండరి కథనం ప్రకారం... నెల్లూరుకు చెందిన మణయ్య (70) నెల్లూరు నుంచి సికింద్రాబాద్-చెన్నై ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణం చేసి మంగళవారం తెల్లవారుజామున సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు చేరుకున్నాడు. రైలు నుంచి దిగే క్రమంలో మణయ్య జారి కిందపడిపోవడంతో తీవ్రగాయాలయ్యాయి. రైల్వే పోలీసులు అతడిని గాంధీ ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.